క్లుప్తంగా

ఓట్లపై ఇంటింటి సర్వే



దాచేపల్లి : మండలంలోని భట్రుపాలెం, కాట్రపాడు గ్రామాల్లో ఇంటింటి సర్వేను శుక్రవారం చేపట్టారు. తహసీల్దార్ టి. ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ శరత్‌కుమార్ తదితరులు ఇంటింటికి వెళ్లి ఓట్లపై ఆరా తీశారు. కొన్ని గృహాల్లో అర్హత ఉన్న వారికి కొత్తగా ఓటు నమోదు చేశారు. స్థానికంగా నివాసం లేని వారి వివరాలు నమోదు చేసుకున్నారు. డెత్‌ల వివరాలు కూడా తొలగించేందుకు నమోదు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటి ఓట్లపై సర్వే నిర్వహించామని, అభ్యంతరాలు ఉన్న వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చునని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు.

రెండవ విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ టౌన్: ఐటీఐలో చేరేందుకు 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చునని, వినుకొండ రూరల్ విఠంరాజుపల్లి గ్రామ శివారులోని శ్రీ బాలాజీ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కర్రి వెంకట్ శుక్రవారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి ఐటీఐలో చేరేందుకు, 2023 ఆగస్టు 5న జరగబోయే రెండవ విడత కౌన్సిలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తారీకు సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు దరఖాస్తుతోపాటు తమ 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డ్ నకలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను జత చేస్తూ, తమ కళాశాలలో దరఖాస్తు చేయాలన్నారు. ఐటీఐ రెండు సంవత్సరాలు పూర్తి చేసిన వారికి ఇగ్నో ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఓపెన్ డిగ్రీ చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఇతర వివరాలకు 9440542030, 8341821710, 7702892288 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రాకేష్‌కు సాహితీ విద్యారత్న పురస్కారం

నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుండాల రాకేష్‌కు దుగ్గిరాలకు చెందిన పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ సంస్థ జాషువా పురస్కారంగా సాహితీ విద్యారత్న బిరుదు ప్రకటించింది. ఈనెల 24వతేదీన జాషువా 51వ వర్ధంతిని పురస్కరించుకొని తెనాలిలో జరగనున్న కార్యక్రమంలో పురస్కారం అందించనున్నట్టు సంస్థ నుంచి ఆహ్వానం అందినట్టు రాకేష్ శుక్రవారం తెలిపారు. విద్యావేత్తగా విద్యాసంస్థను స్థాపించి చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంతో పాటు కవిగా వ్యాసాలు, కవితలు, కథలు రాసిన రాకేష్ రాష్ట్రంలోని పలు సాహితీ సంస్థల పురస్కారాలు అందుకున్నారు. రాకేష్‌ను పట్టణానికి చెందిన పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

నాణ్యమైన మిరపనారు అందించాలి

చిలకలూరిపేట: రైతులకు నాణ్యమైన మిరపనారును మాత్రమే అందించాలని ఉద్యాన అధికారి ఎన్ కిషోర్ చెప్పారు. మండలంలోని రాజాపేట గ్రామంలో షెడ్‌నెట్ నర్సరీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన నారు ద్వారా మాత్రమే ఆశించిన దిగుబడులు సాధ్యమౌతాయని వెల్లడించారు. రైతులు కూడా ప్రతి కొనుగోలుకు సంబంధించి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. నర్సరీ యజమానులు తప్పనిసరిగా 2010 నర్సరీ చట్టం ప్రకారం లైసెన్సులు తీసుకోవాలని చెప్పారు. అంతేకాకుండా రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మహిళకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి పేద వర్గాలను ఆదుకుంటున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) స్పష్టం చేశారు. మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో శుక్రవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పీఆర్కే నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే పీఆర్కేకు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వారికి గుర్తు చేశారు. పథకాలు ఎలా ఉన్నాయని ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు ప్రతి నెలా ఒకటో తేదీనే టంఛన్‌గా వలంటీర్లు ఇంటికి వచ్చి అందిస్తున్నారని పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇతర సంక్షేమ కార్యక్రమాలపై కూడా ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పీఆర్కేను ప్రజలు ఆశీర్వదించారు. తమ ఇంటికి ఎమ్మెల్యే వచ్చి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తీరుపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామంలో 7,159 మంది లబ్ధిదారులకు సగటున రూ. 2,14 లక్షల మేర లబ్ధి చేకూర్చడం జరిగింది. కుల, మతాలు పార్టీలకతీతంగా అర్హులైన అందరికి కూడా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే పీఆర్కే వారికి వివరించారు. ప్రజలు పనుల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కారం చేస్తోందన్నారు. ఈ సంక్షేమం అభివృద్ధి ఇలాగే కొనసాగేందుకు జగనన్నకు మద్దతుగా నిలవాలని ప్రజలకు ఎమ్మెల్యే పీఆర్కే విజ్ఞప్తి చేశారు. గ్రామ సర్పంచ్ జవ్వాజీ నాగేంద్రం, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, ఎంపీటీసీలు కొంగర ఇందిరాదేవి సుబ్రమణ్యం, గాడిపర్తి రమాదేవిపూర్ణయ్య, మాజీ సర్పంచ్‌లు ఉన్నం ఆదిశేషగిరిరావు, మాజీ సర్పంచ్ నర్సింగ నాగేశ్వరరావు, గ్రామ పార్టీ నాయకులు మాచర్ల ఏడుకొండలు, వెన్నపూసల బుల్లెబ్బాయి, నేలపాటి నరసింహారావు, వీరయ్య, బెల్లంకొండ ముత్తయ్య, జవ్వాజి బాలరాజు, తోడేటి సుబ్బారావు, మామిడి అన్నారావు, మారాబత్తుల శ్రీను, వాల్మీకి నరేంద్ర, మామిడి శేఖర్, నాదెండ్ల నాగేశ్వరరావు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు. సీఐ జయకుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో అధికారులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి విద్యుత్ లోక్ అదాలత్



మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్, జడ్జి విక్టరీ ఇమ్మానీయేలు, కమిటీ సభ్యులు

మాచర్ల: డివిజినల్ స్థాయిలో నిర్వహించిన విద్యుత్ లోక్ అదాలత్ వినియోగదారుల సమస్యలను సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి ఎస్ విక్టరీ ఇమ్మానీయేలు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శరవేగంగా అక్కడికక్కడే పరిష్కరించారు. శుక్రవారం ఉదయం 10.30గం''ల నుంచి 3గం''ల వరకు జడ్జి ఎస్ విక్టరీ ఇమ్మానీయేలు, కమిటీ సభ్యులు వెంకట కృష్ణ, రాందాసు, సునీత ఆపరేషన్ ఎస్ఈ మురళీకృష్ణ, డివిజినల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ జె హరిబాబు ఆధ్వర్యంలో పలు సమస్యలను పరిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యుత్ వినియోగదారులు భారీ స్థాయిలో డివిజనల్ కార్యాలయానికి తరలివచ్చారు. 72 సమస్యలపై విద్యుత్ వినియోగదారులు రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వగా, వరస వారీగా ఆయా విద్యుత్ వినియోగదారుల సమస్యలను కమిటీ వారు నేరుగా వినియోగదారులతో ముఖాముఖీ మాట్లాడి 50 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. విద్యుత్ మీటర్ల బిల్లులు, హెచ్చు తగ్గులు, మీటర్ల మరమ్మతులు, విద్యుత్ లైన్ల వల్ల వచ్చే సమస్యలు పలు సమస్యల పై వినియోగదారులు అర్జీలు అందజేశారు. ప్రతి అర్జీని పూర్తి స్థాయిలో కమిటీ సభ్యులు పరిశీలించి వివరాలు తెలుసుకుని అధికారులతో సంప్రదిస్తూ అక్కడికక్కడే పరిష్కరించి వినియోగదారులను సంతృప్తి పరిచారు. డివిజినల్‌లోని ప్రతి విద్యుత్ వినియోగదారులు చెప్పిన సమస్యలను అధికారితో చర్చించి పరిష్కారానికి చొరవ చూపి ఏ ఒక్కరూ నష్టపోకుండా కమిటీ సభ్యులు సూచనలతో నిర్ణయాలు తీసుకోవడంతో పలువురు విద్యుత్ వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాచర్ల ప్రాంతంలో ఇన్ని సమస్యలను ఒకే రోజు పరిష్కరించడం తమకు సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏడిఈలు ఎ రామయ్య, బాజ్జి నాయక్, ఆయా మండల ఏఈలు, సిబ్బంది తదితరులున్నారు.

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి పార్టీ కండువాలు కప్పిన ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: సీఎంవైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న బృహత్తర అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నట్లు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గంగలకుంటకు చెందిన వైఎస్సార్ సీపీకి చెందిన మేడబోయిన కోటయ్య ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మేడబోయిన రమణయ్య, శ్రీను, వెంకయ్య, కొండ, వెంకట కోటయ్య, వెంకటేశ్వర్లు, కడియాల పాపయ్య, మేడబోయిన నాగేశ్వరరావుతో పాటు మరో 15 కుటుంబాలకు చెందిన టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారికి పీఆర్కే కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్ పేద ప్రజల పట్ల ఎంతో అభిమానంతో ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వారి కుటుంబాల్లో సంతోషాలు నింపారన్నారు. ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీలో పనిచేసినప్పటికీ తగిన గుర్తింపు లభించకపోవడంతో వైఎస్సార్‌సీపీ చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించి వారికి అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు నోముల కృష్ణ, పంగా శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కందిపప్పు, బియ్యం పంపిణీ



కందిపప్పు, బియ్యం పంపిణీ చేస్తున్న పట్టణంలోని కోదండ రామాలయంలోని కేంద్రం

మాచర్ల: పట్టణంలో పది రోజుల కిందట పట్టణంలోని కోదండ రామాలయంలోని కేంద్రంలో పౌర సరఫరాల శాఖ, డాల్, రైస్ మిల్లుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలకు కందిపప్పు, బియ్యంను పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సివిల్ సప్లై రెవెన్యూ, వివిధ శాఖాధికారులు డాల్, రైస్ మిల్లుల అసోసియేషన్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ప్రతి ఒక్క రేషన్ కార్డు కలిగిన వారికి రెండు కేజీల కందిపప్పు రూ. 240కే, 25 కేజీల బియ్యం రూ. 1225లకే పంపిణీ చేస్తున్నారు. ధరలు తగ్గే వరకు ఈ అవకాశాన్ని ప్రతి రోజు ఆధార్ లేక రేషన్ కార్డు కలిగిన వారికి అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

పిడుగురాళ్లల్లో వర్షం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో గత రెండు రోజుల నుంచి చిన్నపాటి తుప్పర్లతోకూడిన వర్షం పడుతూ ఉంది. వర్షం లేకపోతే నల్లటి మబ్బులు కమ్ముకుని కొంత సమయానికి వర్షం పడుతూ ఉంది. ఇప్పటికే పంట పొలాలు వేసిన వారు, భూములను సదును చేసుకున్న వారు పంట పొలాల్లో విత్తనం విత్తుతున్నారు. ఎది ఏమైనా ఈ వర్షం రైతులకు కొంత ఆనందాన్ని కలిగించే వర్షమైనప్పటికి పెద్ద వర్షం పడితే ఇంకా బాగుంటుందని రైతులు అంటున్నారు.

మాచర్లలో

మాచర్ల: పట్టణంలో మూడు రోజులుగా వర్షం ఏదోరకంగా కురుస్తూ చల్లని వాతావరణాన్ని తీసుకొచ్చింది. అనేక రోజులుగా వర్షాభావ పరిస్థితులతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పిస్తూ ప్రతిరోజూ మబ్బులు భారీగా కమ్ముతున్నాయి. వర్షం మాత్రం రాత్రివేళ కురుస్తుంది. గత కొన్ని రోజులుగా పూర్తిస్థాయిలో వర్షాలు లేక వర్షం కురుస్తున్న జనానికి ఆశాజనకంగా వర్షాలు ప్రారంభమయ్యాయి. అయితే వర్షం పూర్తిస్థాయిలో కురవడంలేదు. ప్రజలు ఆశించిన మేరకు వర్షం కురవకపోయినా, వర్షం కురిసే పరిస్థితి ప్రస్తుతం ఆశాజనకంగా కనబడుతుంది.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



ధ్రువీకరణ పత్రం పంపిణీ చేస్తున్న అధికారులు



సర్టిఫికెట్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, అధికారులు

కారెంపూడి: గ్రామంలోనే గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన జగనన్న సురక్షా కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జి శ్రీనివాస్, ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని నరమాలపాడు గ్రామంలో జగనన్న సురక్ష గ్రామ సభను శుక్రవారం అధికారులు నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కారం చేసి వారికి తగిన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. మొత్తం 231 అర్జీలను పరిష్కారం చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుండ్లకుంట వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ చేవూరి భవాని,మాజీ సర్పంచ్ రామ్మడుగు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఏకసిరి లక్ష్మీతిరుపతిరావు, గ్రామ పార్టీ నాయకులు రామ్మడుగు సీతారామయ్య, బుర్రి రామగురవయ్య, దారివేముల కిరణ్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, ఈఓపీఆర్డీ పి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో....

దాచేపల్లి : రాష్ట్రంలో పారదర్శకమైన పాలన ప్రజలకు అందిస్తున్నామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య అన్నారు. సచివాలయం-3లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రజలకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. చైర్మన్ సుబ్బమ్మ సాంబయ్య మాట్లాడుతూ...గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తోందని చెప్పారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలు నిర్విరామంగా అందుతున్నాయని, వలంటీర్ల సేవలను ప్రజలు మెచ్చుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు కొమెరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్‌భాషా, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ వి. సత్యనారాయణ, కౌన్సిలర్లు నాగుబండి గురువులు, దేవళ్ల లక్ష్మీప్రసన్న, నాయకులు కొలా జంపాలరెడ్డి, షేక్ సైదా పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతికే జగనన్న సురక్ష

దుర్గి: మండల పరిధిలోని ఓబులేశునిపల్లెలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఏసూరి సాయిశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష విజయవంతంగా కొనసాగుతుందన్నారు. మండలంలోని గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి ప్రజలకు అవసరమైన ధృవపత్రాలు ఉచితంగా అందించామన్నారు. సీఎం జగన్ పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో పథకాలను అమలు చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమందమాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనటువంటి గొప్ప కార్యక్రమం జగనన్న సురక్ష అన్నారు. ప్రభుత్వ విప్ పీఆర్కే నాయకత్వంలో మరల మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవలసిన బాధ్యత మనందరి పై ఉందన్నారు. సచివాలయం పరిధిలో మొత్తం వివిధ విభాగాలకు చెందిన 308 ధృవపత్రాలను, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం రమేష్ కుమార్, ఎంపీడీఓ కె సమతా వాణి, సర్పంచ్ ఉన్నం పెద్దబ్బాయ్, ఈఓపీఆర్‌డి ఎల్ఎన్ గుప్తా, వీఆర్ఓ సునీత, సెక్రెటరీ పలువురు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గడప సంక్షేమానికే జగనన్న సురక్ష ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: రాష్ట్రంలోని అర్హులున్న ప్రతి గడప సంక్షేమానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శుక్రవారం రెంటచింతల గ్రామంలోని సచివాలయం-1 వద్ద సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయని విధంగా ప్రజలకు క్షేత్రస్థాయిలోనే వారికి అవసరమైన కులం, ఆదాయం, నివాసం, అడంగళ్, పింఛన్, రేషన్ కార్డు, వితంతు, కుటుంబ విభజన తదితర 11 రకాల ధృవీకరణ పత్రాలను ఉచితంగా అందచేయడానికి జగనన్న సురక్ష కార్యక్రమం సీఎం జగన్ ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష ద్వారా ప్రజల ఉచిత సేవలతో పాటు వారి సమస్యలు తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అనేక లక్షల కుటుంబాలకు ఈ కార్యక్రమం ద్వారా ఎంతో మేలు చేకూరిందన్నారు. అనంతరం వివిధ రకాల సేవలకోసం, పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులైన 94 మందికి ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమలో సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన నాయకులు మోర్త ఉమ, మండల సచివాలయాల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, ఈవోపీఆర్డీ సీహెచ్ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, కార్యదర్శి జి. అనంత కోటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు మోదుగు శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డీఎల్‌డీవో తనిఖీలు

ఈపూరు: మండలంలోని కొచ్చర్ల, కొండ్రముట్ల గ్రామ సచివాలయాలను నరసరావుపేట డీఎల్‌డీవో వెంకటరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎల్‌డీవో వెంకటరెడ్డి సిబ్బందితో మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, సచివాలయ పరిధిలో ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సర్వీసులను పరిష్కరించే విధంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఎనిమిక్ ఉన్నవారిని గుర్తించి సచివాలయ సిబ్బంది మ్యాప్ చేసుకొని వారికి పోషకాహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రైతు ప్రయోజనాలను కేంద్రం విస్మరించింది

అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు



మాట్లాడుతున్న డాక్టర్ రాజమోహనరావు

చిలకలూరిపేట: కేంద్రప్రభుత్వం 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న వాగ్దానాన్ని విస్మరించి రైతాంగ ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అఖిలపక్ష నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరికీ ఆహారాన్ని అందిస్తున్న రైతులను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందని, ఫలితంగా రైతులు వ్యవసాయానికి దూరమౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన రైతు సమ్మేళనంలో రైతు పోరాటాలకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఏటా సాగు ఖర్చులు పెరుగుతూ ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతులు వ్యవసాయం చేయలేని దుస్థితి ఏర్పడిందని వివరించారు. పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులను దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు 90 శాతం సబ్సిడీపై అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, నాయకులు మిరియాల వెంకటరత్నం, బొల్లు శంకరరావు, నాగభైరు రామసుబ్బాయమ్మ, ఎం రాధాకృష్ణ, పేరుబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మహర్దశ

- రూ.12 కోట్లతో రోడ్ల నిర్మాణం..
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో నిధుల మంజూరు



అభివృద్ధి చేయనున్న దాచేపల్లి-కారంపూడి రోడ్డు



బంగ్లా సెంటర్ నుంచి నడికుడి సచివాలయం వరకు రోడ్డు విస్తరణ పనులు చేసిన దృశ్యం

దాచేపల్లి : రోడ్ల నిర్మాణం, ఆధునికీకరణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జనాభా పెరుగుదల..వాహనాల రద్దీ నేపథ్యంలో రోడ్లను సర్వంగా సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటి వరకు అధ్వానంగా ఉన్న రోడ్లను ఆధునికీకరణ చేసి అభివృద్ధి చేయనున్నారు. మండల పరిధిలో రూ.12 కోట్లతో మూడు రోడ్లను అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

రూ. 12 కోట్లతో మూడు రోడ్ల అభివృద్ధి...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. దాచేపల్లి నుంచి తంగెడ కృష్ణానది రేవు వరకు 17.15 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పనులు రూ. 5.07 కోట్లతో చేపట్టానున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టి దాచేపల్లి నుంచి తంగెడ రేవు వరకు తారురోడ్డు వేయనున్నారు. ఈ రోడ్డు పనులు ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయి. త్వరితగతిన టెండర్లు పూర్తి చేయించి రోడ్డు నిర్మాణం కూడా సకాలంలో వేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అదే విధంగా దాచేపల్లి నుంచి కారంపూడి వరకు సూమారుగా 20 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.4కోట్ల నిధులు మంజూరు చేసింది. దాచేపల్లి పట్టణంలో కారంపూడి రోడ్డు ప్రారంభమయ్యే స్థలం నుంచి రోడ్డుపై అక్రమణలు తొలగించి విస్తరణ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు కూడా నిర్మించనున్నారు. నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి నడికుడి సచివాలయం వరకు రోడ్డు విస్తరణ, ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టెండర్ల ప్రక్రియ ముగియడంతో సంబంధిత కాంట్రాక్టర్ వేలం ద్వారా టెండర్‌ను దక్కించుకుని పనులు ప్రారంభించారు. ఇప్పటికే రోడ్డు స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ నిర్మాణం పనులు ప్రారంభించారు. రోడ్డు ఆధునికీకరణలో భాగంగా ఆక్రమణలు తొలగించేందుకు ప్రజలు పూర్తిగా సహకరించడంతో పనులు ఊపందుకున్నాయి. త్వరలోనే స్టేషన్ రోడ్డు నిర్మాణం, విస్తరణ పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు విస్తరణతో వాహనాల రాకపోకలకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని స్థానికులు చెబుతున్నారు. నడికుడి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఇరికేపల్లి వరకు రోడ్డు నిర్మాణం, ఆధునికీకరణ పనుల కోసం ప్రభుత్వంకు నివేదికలు పంపించారు.

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితో...

రోడ్ల అభివృద్ధిపై స్థానిక శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక దృష్టిని సారించాడు. అదేబాట, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాసు దృష్టికి రోడ్ల సమస్యను ప్రజలు తీసుకురావడంతో విస్తరణ, ఆధునికీకరణ కోసం నిధులు మంజూరు చేయించారు. స్టేషన్ రోడ్డు నిర్మాణం పనులను పలుమార్లు ఎమ్మెల్యే కాసు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. టెండర్లు ముగిసిన తరువాత తంగెడ, కారంపూడి రోడ్లు విస్తరణ, ఆధునికీకరణ పనులు శరవేగంగా జరిగేలా ఎమ్మెల్యే కాసు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే కాసు పట్టుబడి నిధులు మంజూరు చేయించారని ప్రజలు భావిస్తున్నారు. రోడ్లు విస్తరణ, ఆధునికీకరణ కోసం నిధులు మంజూరు చేయించి ఎమ్మెల్యే కాసును ప్రజలు అభినందిస్తున్నారు..

రోడ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయిస్తాం

టెండర్ ముగిసిన నారాయణపురం, నడికుడి రోడ్డు విస్తరణ, ఆధునికీకరణ పనులకు సంబంధించి టెండర్లు ముగియడంతో పనులు వేగంగా జరుగుతాయి. దాచేపల్లి-కారంపూడి, దాచేపల్లి-తంగెడ రేవు రోడ్లుకు కూడా త్వరలోనే టెండర్లు పూర్తి చేయించి రోడ్ల నిర్మాణ పనులు చేపడతాం.

– బి. నీరజ. ఏఈ ఆర్అండ్‌బీ

బాలికను పరామర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండలోని ఎస్టీ బాలికల వసతి గృహంలో 4వ తరగతి విద్యార్థినీ ప్రమాదవశాత్తు సాంబరు గిన్నెలో పడి తీవ్ర గాయాలపాలైంది. అయితే ఈ ఘటనపై విచారించేందుకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్ శుక్రవారం వినుకొండకు వచ్చారు. గత ఆదివారం ఎస్టీ హాస్టల్‌లో చదువుకుంటున్న 4వ తరగతి బాలిక భోజన విరామ సమయంలో విద్యార్థినీల తోపులాట జరిగి కాలుతున్న సాంబరు గిన్నెలో పడింది. అయితే వెంటనే స్పందించిన పాఠశాల సిబ్బంది సదరు బాలికను వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. సమాచారం తెలుసుకున్న శంకర్‌నాయక్ స్థానిక తహసీల్దార్ కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. అనంతరం ఎస్టీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థినులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.